
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 44.0: కనిష్ఠం 29.3
నిజామాబాద్
జిల్లా వార్తలు
5
గురువారం 24 ఏప్రిల్ 2025



నేడు నగరంలో విద్యుత్ అంతరాయం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో దుబ్బ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని నగర టౌన్-2 ఏడిఈ ప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దుబ్బ సబ్ స్టేషన్ పరిధిలోని గౌడ్స్ కాలనీ, గుమస్తా కాలనీ, మహేశ్వరి భవన్, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్, తదితర ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఢిల్లీ ఎయిర్ పోర్టు అథార్టీ ఆఫ్ ఇండియా బృందం అధికారులు

జక్రాన్‌పల్లిలో ఎయిర్‌పోర్టుకు ప్రతిపాదిత స్థలం పరిశీలన

- స్థలాన్ని పరిశీలించిన ఢిల్లీ ఎయిర్‌పోర్టు అథార్టీ ఆఫ్ ఇండియా బృందం
- ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు అనుకూలమైన స్థలం ఉందని వెల్లడించిన అధికారులు


జక్రాన్‌పల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జక్రాన్‌పల్లిలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు ప్రతిపాదిత స్థలాన్ని బుధవారం ఢిల్లీ ఎయిర్‌పోర్టు అథార్టీ ఆఫ్ ఇండియా బృందం అధికారులు పరిశీలించారు. జక్రాన్‌పల్లి, మనోహరాబాద్, కొలిప్యాక్, తొర్లికొండ, అర్గుల్ గ్రామాల సరిహద్దుల్లో నిర్మించనున్న ఎయిర్‌పోర్టు ప్రతిపాదిత స్థలాన్ని ఢిల్లీ బృందం అధికారులు, నిజామాబాద్ అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్, అధికారులు కలిసి స్థలాన్ని పరిశీలించారు. మొదట జక్రాన్‌పల్లి, అర్గుల్, తొర్లికొండ హైవే జాతీయ రహదారుల నుంచి ఎయిర్ పోర్టుకు వెళ్లేందుకు పెద్దరోడ్ల నిర్మాణ స్థలాలను బృందం అధికారులు ఎయిర్‌ఫోర్టు మ్యాప్‌తో పరి శీలించారు. గతంలో ఢిల్లీ ఎయిర్‌పోర్టు బృందం అధికారులు ఈ జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్టు ప్రతి పాదిత స్థలాన్ని పరిశీలించగా అప్పటికీ, ఇప్పటికీ రోడ్లు, భూములలో, ఇతర పనులలో మార్పుల చేర్పుల గురించి స్థానిక అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈఐదు గ్రామాలు ఎయిర్ పోర్టు నిర్మాణంలో కోల్పోతున్న భూముల వివరాలను, ఇతర ఎయిర్‌పోర్టుకు సంబంధించిన విషయాలను ఢిల్లీ బృందం అధికారులు స్థానిక అధికారులను వివరాలు అడుగగా దానికి అధికారులు ఢిల్లీ బృందం అధికారులకు క్షుణంగా వివరించారు. జక్రాన్‌పల్లిలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకోసం అనువైన స్థలం ఉందని బృందం అధికారులు తెలిపారు. తాము చూసిన పూర్తి వివరాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదికను అందజేస్తామని బృందం అధికారులు తెలిపారు. వీరి వెంట ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, జక్రాన్‌పల్లి తహసీల్దార్ కిరన్మయ్, ఆర్ఐ ప్రవీణ్, సర్వేయార్లు రత్నకర్, దానియల్, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.



● ఎడపల్లిలో పనులు చేస్తున్న కూలీలు

ఉపాధి హామీ పనులకు ఎండ దెబ్బ

- జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న ఎండ తీవ్రత
- ఉపాధి హామీ పనులకు వెళ్లేందుకు జంకుతున్న కూలీలు
- గత నెలతో పోలిస్తే తగ్గిన ఉపాధి కూలీల సంఖ్య
- ఉదయం వేళ పనులకు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



నిజామాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఉపాధి హామీకి ఎండ దెబ్బకొడుతోంది. ఎండవేడి ఒకేసారి పెరగడంతో కూలీలు ఉపాధి హామీ పనికి వచ్చేందుకు జంకుతున్నారు. గ్రామాల్లో ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుండటంతో ఎక్కువ మంది పనులకు రావడం లేదు. గత నెలతో పోలిస్తే ఉపాధి హామీకి వచ్చేవారి సంఖ్య తగ్గుతోంది. ఎండలు పెరగడం.. చెరువుల్లో పూడికతీత పనులు లేకపోవడం.. ఎక్కువ సమయం పనులు చేసినా వేతనం తక్కువగా వస్తుండటంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం చెరువుల్లో పనులు నిలిపివేయడం వల్ల వ్యవసాయ భూములు, అటవీ భూములతో పాటు నర్సరీల్లో కూలీలు పని చేస్తున్నారు. పనిచేసే చోట అవసరమైన టెంట్లు లేకపోవడం ఉదయం 11గంటలలోపే ఉష్ణోగ్రతలు 40కి పైగా నమోదు అవుతుండటంతో ఎక్కువ మంది జంకుతున్నారు. గతంలో లాగానే చెరువు పనులకు అనుమతులు ఇస్తే తమకు ఉపయోగం ఉంటుందని కూలీలు కోరుతున్నారు. కందకాలు, అటవీ భూముల్లో పనులు చేస్తున్న గట్టి భూములు కావడంతో ప్రతీరోజు నిర్ణయించిన ప్రకారం వేతనాలు రావడం లేదు. పనిచేసిన రోజులకు కూడా ఆలస్యంగా ఖాతాల్లో డబ్బులు పడుతుండటంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు కూడా చెరువుల్లో మట్టి పనులు చేపడితే తమకు ఉపయోగం ఉంటుందని కోరుతున్నారు.

జిల్లాలో 2లక్షల 55వేల 236 జాబ్‌కార్డులు

జిల్లాలో అధికారుల లెక్కల ప్రకారం 2లక్షల 55వేల 236 జాబ్‌కార్డులు ఉన్నాయి. వీటి పరిధిలో 4లక్షల 83వేల 762 మంది కూలీలకు పనులు కల్పిస్తున్నారు. ప్రతీ సంవత్సరం నిర్ణయించిన బడ్జెట్ ప్రకారం పనులు చేస్తున్నారు. ఈ సంవత్సరం కూడా జిల్లాలో కూలీలకు 29.93లక్షల పని దినాటలను కల్పించాలని నిర్ణయించారు. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో 90కోట్ల విలువైన పనులు ఉపాధి హామీ కూలీల ద్వారా చేపట్టాలని నిర్ణయించారు. జిల్లాలో పని అడిగిన ప్రతి కూలీకి కల్పించే విధంగా ఏర్పాట్లను చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల పరిధిలో నర్సరీలు, అటవీ భూములు, వ్యవసాయ భూముల్లో ప్రస్తుతం ఈ పనులను చేపడుతున్నారు. అటవీ భూముల్లో కందకాలు తవ్వడం, చెక్‌డ్యామ్‌లకు సంబంధించి పనులు చేయడం, అటవీ, నర్సరీల్లో పనులను కల్పిస్తున్నారు. ఇవే కాకుండా ఆయా గ్రామాల పరిధిలో వ్యవసాయ భూములకు సంబంధించిన కందకాలను తవ్వుతున్నారు. చెరువుల్లో ఫిష్‌పాండ్ నిర్మాణాల కోసం పనులు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నిర ్ణయించిన విధంగా ఈ పనులను కల్పిస్తున్నారు. ప్రతిరోజు ఆయా గ్రామాల పరిధిలో వచ్చే కూలీలకు పనులు కల్పించడంతో పాటు వారు చేసే పనులను గ్రూప్ ఫొటోలు, సెల్ఫీలను అప్‌లోడ్ చేస్తున్నారు. దానికి అనుగుణంగానే వారి ఖాతాల్లో డబ్బులను జమ చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ కూలీల వేతనాన్ని 307 రూపాయలుగా నిర్ణయించింది. గతంలో 300 ఉండగా 7 రూపాయలను పెంచింది. ఈ కూలీకి అనుగుణంగా ప్రతిరోజూ వారు చేసే పనులకు అనుగుణంగా ఆరోజు వేతనాలను జమ చేస్తున్నారు.

తగ్గిన కూలీల సంఖ్య

గత నెలలో జిల్లాలోని 545 గ్రామ పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ పనులకు 30వేలకు పైగా కూలీలు రాగా ప్రస్తుతం ఆ సంఖ్య భారీగా తగ్గింది. ప్ర స్తుతం సరాసరి 23 వేల నుంచి 24వేల మధ్యనే కూలీలు పనులకు హాజరవుతున్నారు. వడ గాల్పులు పెరగ డం ఎండ ఎక్కువగా ఉండటం వల్ల పనులకు వచ్చేందుకు ఉపాధి హామీ కూలీలు జంకుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో కొంత మంది కూలీలు వచ్చిన 11గంటలలోపే తిరిగి వెళ్తున్నారు. తాగునీటి సరఫరా చేస్తున్నా ఎండలో పనిచేసేందుకు వెనకడుగు వేస్తున్నారు. అధికారులు మాత్రం ఉదయం 6గంటల నుంచి 10గంట లలోపే ఎక్కువగా పనులు చేయించే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఎండలో పనులు చేస్తున్నా గడిచిన నెలరోజులుగా కూలీలకు మాత్రం వేతనాల చెల్లింపులో జాప్యం జరుగుతోంది. జిల్లాలో ప్రతీరోజు కూలీల సంఖ్య పెరిగే విధంగా ప్రయత్నాలు చేస్తున్నామని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయిగౌడ్ తెలిపారు. కూలీలకు అన్ని రకాల పనులు కల్పించడంతో పాటు వేతనాలు ఎక్కువగా వచ్చే విధంగా కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. ఎండలు ఎక్కువగా ఉన్న ఉదయం పూట పనులు చేపట్టే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు.



● ధర్పల్లిలో పనులు చేస్తున్న కూలీలు

స్టాళ్లలో ఏర్పాటు చేసిన పరికరాలను పరిశీలిస్తున్న రైతులు



ముగిసిన రైతు మహోత్సవం

● ఉత్సాహంగా పాల్గొన్న రైతులు ● సలహాలు, సూచనలు అందించిన శాస్త్రవేత్తలు, నిపుణులు
● పాల్గొన్న వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ జానయ్య, కలెక్టర్, కార్పొరేషన్ చైర్మన్లు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రైతు మహోత్సవ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. నిజామాబాద్, కామారెడ్డి, సిరిసిల్ల, నిర్మల్, జగిత్యాల జిల్లాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాలకు చెందిన 130కి పైగా స్టాల్స్ ఏర్పాటు చేయగా రైతులు వారు పండించిన ఉత్పత్తులతో పాటు వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల ఉత్పత్తులను, ఆధునిక సాగు పరికరాలు, అధిక దిగుబడిని ఇచ్చే వంగడాలు, మేలుజాతి పాడిపశువులు, వ్యవసాయ పరికరాలు తదితర స్టాల్స్‌ను రైతులు ఆసక్తిగా గమనించారు. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్యశాఖ శాస్త్రవేత్తలు, నిపుణులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ, కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యానవన యూనివర్సిటీ, ఇతర పరిశోధన కేంద్రాల శాస్త్రవేత్తలు మూడు రోజుల పాటు నిర్వహించిన వర్క్ షాప్‌లలో రైతులు పాల్గొన్నారు. వివిధ రకాల పంటల సాగులో పాటించాల్సిన మెలకువలు, సస్య రక్షణ చర్యలు, ఆధునిక వ్యవసాయం, బూసారం పెంపుదల, అధిక దిగుబడులు అందించే వంగడాలు, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను సాధించేందుకు అనుసరించాల్సిన పద్ధతులు, వాణిజ్య పంటల ఎంపికలకు పరిశీలించాల్సిన అంశాలను సెషన్ల వారీగా రైతులకు వివరించారు.

ఎగుమతుల ద్వారా రైతాంగానికి లాభం..

:ఎ.జానయ్య, ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ వైస్‌చాన్స్‌రల్

రాష్ట్రంలో పండుతున్న ధాన్యాన్ని ఇతర దేశాలకు ఎగుమతులు చేయడం ద్వారా రైతులకు లాభం చేసే చర్యలకు శ్రీకారం చుట్టిందని ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ వైస్‌చాన్స్‌లర్ ఎ.జానయ్య అన్నారు. రైతులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహనతో పాటు నూతన వ్యవసాయ పద్ధతులను రైతులకు వివరించేందుకు ఈ ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జూన్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 40వేల మంది రైతులకు 12వేల గ్రామాలలో ఐదు రకాల విత్తనాలను సరఫరా చేస్తూ వాటిని పండించి తిరిగి వాటిని ఇతర రైతులకు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుందన్నారు. మే 6 నుంచి జూన్ 13 వరకు రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం ద్వారా ప్రతీ రైతు వద్దకు వెళ్లి గ్రామాలలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ప్రభుత్వం సరఫరా చేసే విత్తనాలనే వాడాలి..

:అన్వేష్‌రెడ్డి, చైర్మన్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ

బోగస్ కంపెనీలు పెద్ద పెద్ద ప్రకటనలతో విత్తనాలు సరఫరా చేస్తూ రైతులను మోసం చేస్తున్నాయని పదేళ్లలో ప్రభుత్వ విత్తనాభివృద్ధి సంస్థను నిర్వీర్యం చేసిందని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ శాస్త్రవేత్తల ద్వారా తయారు చేసిన నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించేలా ప్రయత్నాలు చేస్తుందన్నారు. వచ్చే ఖరీఫ్ కోసం రైతులు ప్రభుత్వం ద్వారా సరఫరా అయ్యే విత్తనాలను వాడాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన విత్తన చట్టం తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తుందన్నారు.

రైతులకు ఎంతగానో ప్రయోజనం..

: రాజీవ్‌గాంధీ హన్మంతు, కలెక్టర్

జిల్లాలో రైతు మహోత్సవం కార్యక్రమం నిర్వహించడం ద్వారా జిల్లా రైతులతో పాటు ఐదు జిల్లాల రైతులకు ప్రయోజనం చేకూరిందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. ప్రస్తుత పరిస్థితులు సామాజిక అవసరాలకు అనుగుణంగా వ్యవసాయ, అనుబంధరంగాలలో శాస్త్రవేత్తలు కనుగొన్న నూతన ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం, మెలకువలు, యాంత్రీకరణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించామన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించిన రైతు మహోత్సవ కార్యక్రమంలో రైతులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామని ఆయన అన్నారు.

స్టాళ్లను సందర్శించిన ప్రముఖులు..

రైతు మహోత్సవ కార్యక్రమంలో బుధవారం పలు స్టాళ్లను రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ మెంబర్ గడుగు గంగాధర్, డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజరెడ్డి తదితరులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు శ్రీలత, అంజయ్య, చంద్రశేఖర్, ప్రవీణ్, శివకృష్ణ, శాస్త్రవేత్తలు రాజ్‌కుమార్, శ్వేత, రాజశేఖర్, విజయ్, స్వప్న, అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, అంకిత్, జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, ఉద్యా నవన శాఖ సంయుక్త సంచాలకులు శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.



స్టాళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్, కార్పొరేషన్ చైర్మన్లు, తదితరులు

భూ సమస్యల పరిష్కారం కోసమే భూ భారతి చట్టం

● కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

మోస్రా, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం కోసమే భూ భారతి చట్టం అని, రైతుల భూములపై వారికి పూర్తి హక్కులు కల్పించేందుకే ప్రభుత్వం నూతనంగా భూ భారతి చట్టం తెచ్చిందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అన్నారు. భూ భారతి చట్టం-2025పై బుధవారం చందూర్, మోస్రా మండల కేంద్రాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో కలెక్టర్ పాల్గొని రైతులకు ఒక్కో అంశం వారీగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ధరణి పోర్టల్‌లో లేని అనేక సమస్యలకు భూభారతి చట్టం ద్వారా పరిష్కారం లభించనుందని అన్నారు. ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరం ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి వచ్చేదని అన్నారు. కానీ ప్రస్తుత భూ భారతి చట్టం కింద భూ సమస్యలు పరిష్కరిస్తూ అధికారులు జారీ చేసిన ఉత్తర్వులపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే అప్పీలు చేసుకునే అవకాశం కూడా ఉందని అన్నారు. తహసీల్దార్ స్థాయిలో దరఖాస్తు చేసుకుంటే న్యాయం జరగలేదని భావిస్తే ఆర్డీవోకు, అక్కడ కూడా సంతృప్తి చెందకపోతే కలెక్టర్‌కు అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. అప్పీలు చేసుకున్న పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, స్థానిక అధికారులు తహసీల్దార్ శాంత, మారుతి, శ్రీనివాస్, నాగనాథ్, ఉమ్మడి వర్ని ఎస్సై మహేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

సాదా బైనామా సమస్యల పరిష్కారం

చందూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక మోస్రా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో భూభారతి భూమి పట్టాల విషయంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు మాట్లాడుతూ.. భూమి హక్కులు, భూ సమస్యలు పరిష్కారం ధరణి స్థానంలో కొత్త భూమి హక్కుల రికార్డ్ హక్కుల రికార్డులో తప్పుల సవరణ అవకాశం రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేయడానికి ముందు భూముల సర్వే సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంపై వివరించారు. రైతులకు ఉచిత న్యాయం సహాయం గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ మోసపూరిత హక్కుల రికార్డులు మార్చి ఎవరైనా ప్రభుత్వ భూధన్, అసైన్డ్, ఎండోమెంట్, వక్ఫ్ భూముల పట్టాలు పొందితే రద్దు చేసే అధికారం వంటి పలు అంశాలపై పూర్తిగా వివరాలు తెలిపారు. సెక్షన్, రూల్, షెడ్యూల్ ప్రకారం ప్రతి సమస్య పరిష్కారం చేయడం జరుగుతుంది అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు సబ్ కలెక్టర్ వికాస్ మహతో, చందూర్ తహసీల్దార్ శాంత, మోస్రా తహసీల్దార్ మారుతి, ఉమ్మడి వర్ని మండల ఎస్సై మహేష్, ఎంపీడీవోలు నీలావతి, శ్రీనివాస్, ఎంఈవో నాగనాథ్, శ్రీనివాస్ రెడ్డి, వైద్య అధికారి విజయ్ కుమార్, ఏపీఎం పలు శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

రక్ష సేవాసంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి చౌరస్తాలో బుధవారం రక్ష స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఖాందేష్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి విద్య ప్రవీన్‌పవార్, ఉపాధ్యక్షుడు నరహరి పాల్గొన్నారు.

తాడ్వాయి : మండల కేంద్రంలో గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు మండల అభివృద్ధి అధికారి సయ్యద్ సాజీద్ అలీ తెలిపారు. గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మేకల రాజు తదితరులు ఉన్నారు.

మున్సిపల్ పరిధిలో దరఖాస్తుల పరిశీలన

ఆర్మూర్ టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ పరిధిలోని పలు వార్డులలో రాజీవ్‌యువ వికాస్ దరఖాస్తులను పరిశీలించినట్లు మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు. పట్టణంలోని 12, 13, 30, 34 వార్డులలో రాజీవ్‌యువ వికాసం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వద్దకు వెళ్లి అర్హులను గుర్తించామని ఆయన తెలిపారు. కమిషనర్ వెంట సీనియర్ అసిస్టెంట్ శేఖర్, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

డిగ్రీ కళాశాలలో ఆంగ్లభాష దినోత్సవం

ఆర్మూర్ టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో బుధవారం ఆంగ్లభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. చంద్రిక మాట్లాడుతూ షేక్స్పియర్ జయంతి సందర్భంగా ఆంగ్లభాష దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని అన్నారు. కార్యక్రమంలో ఆంగ్లవిభాగపతి కే.జ్యోతి, అధ్యాపకులు సాయి రక్షిత, ఎన్.సుహాసిని, ప్రనూష, అధ్యాపకులు పాల్గొన్నారు.

మోతెలో ఇంటిని పరిశీలించిన అధికారులు

వేల్పూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోతె గ్రామంలో 7వ వార్డులో ఇంటిని బుధవారం అధికా రులు పరిశీలించారు. గ్రామ పంచాయతీ ఇంటి నిర్మాణానికి ఇచ్చిన అనుమతి ప్రకారం కాకుండా సుమారు రెండున్నర ఫీట్ల వరకు రోడ్డువైపుకు స్లాబ్‌వేశారని ఆ వార్డులోని పలువురు డీఎల్‌పీవో, ఎంపీడీవోలకు ఫిర్యాదు చేశారు. దీంతో వారి ఆదేశాల మేరకు ఎంపీవో సాయిలు, జీపీ కార్యదర్శి మహ్మద్ ఖాన్ నిర్మిస్తున్న ఇంటిని పరిశీలించారు. రోడ్డువైపునకు అదనం గా రెండున్నర ఫీట్ల వరకు స్లాబ్‌వేయడం సరికాదని ఇంటి యజమాని సుజాతకు సూచించారు. ప్రస్తుతం స్లాబ్ సెంట్రింగ్ ఉన్నందున ఆ సెంట్రింగ్‌ను తొలగించిన తర్వాత అరఫీట్ స్లాబ్ ను తీసివేయాలని జీపీ ద్వారా అధికారులు నోటీసులు ఇచ్చారు. అందుకు ఆ ఇంటి యజమాని అంగీకరించినట్లు ఎంపీవో సాయిలు తెలిపారు.

ఫారెస్టు అధికారికి నెమలి అప్పగింత



గాయపడిన నెమలిని ఫారెస్టు అధికారి ఉత్తమ్‌కు అప్పగిస్తున్న గంగపుత్రులు

వేల్పూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాన్కంపేట్ గ్రామ శివారులో బుధవారం గాయపడిన నెమలిని గంగపుత్రులు ఫారెస్టు అధికారి ఉత్తమ్‌కు అప్పగించారు. జాన్కంపేట్ గ్రామ చెరువులో చేపలు పట్టడానికి వెళ్లిన గంగ పుత్రులు చెరువులో గాయపడి కొట్టుమిట్టాడుతున్న నెమలిని చూసి గ్రామ మాజీ సర్పంచ్ సౌడ రమేష్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో సర్పంచ్ ఫారెస్టు అధికారి ఉత్తమ్‌కు ఫోన్ ద్వారా విషయం చెప్పడంతో వెంటనే అధికారి గ్రామానికి చేరుకోగా నెమలిని ఆయనకు అప్పగించారు.

డంపింగ్ యార్డులో వేయింగ్ మిషన్ సీజ్

బోధన్‌రూరల్‌ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని డంపింగ్ యార్డులో బుధవారం సాయంత్రం వేయింగ్ మిషన్‌ను తూనికలు, కొలతల శాఖ జిల్లా అధికారి మహ్మద్ సుజాత్ అలీ, బోధన్ అసిస్టెంట్ అధికారి నరేష్‌లు సీజ్ చేశారు. డంపింగ్ యార్డులో ఉన్న వేయింగ్ మిషన్‌లో తూకంలో తేడాలు ఉన్నాయని ఫిర్యాదులు ఉన్నాయని తనిఖీలు చేశామన్నారు. వాస్తవంగా వేయింగ్ మిషన్ తూకంలో తేడాలు ఉన్నాయని పేర్కొన్నారు. కావున డంపింగ్ యార్డులోని వేయింగ్ మిషన్‌ను సీజ్ చేయడం జరిగిందని అధికారులు వివరించారు.

'సామాజిక సేవకు మార్గదర్శి బుద్దె'

బోధన్‌రూరల్‌ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవకు మార్గదర్శకంగా ఉన్న బుద్దె రాజేశ్వర్ అకాల మరణం బోధన్ నియోజకవర్గానికే తీరని లోటని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం సాలూర మండల కేంద్రంలో హనుమాన్ మందిరం బైపాస్ రోడ్డులోబుద్దె రాజేశ్వర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్, అల్లె రమేష్, ఇల్లెపు శంకర్, సాలూర షకీల్, కల్దుర్కి సొసైటీ చైర్మన్ శరత్, బోధన్ ఏసీపీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విధులను సక్రమంగా నిర్వర్తించాలి

రామారెడ్డి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించాలని రామారెడ్డి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సురేష్ పేర్కొన్నారు. బుధవారం ఇసన్నపల్లి గ్రామంలోని మినీ దవాఖానాను ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నపిల్లలకు ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం జ్యోతి, సీహెచ్‌వో రమ్య, ఆశా, వనిత పాల్గొన్నారు.

'పోస్టుల భర్తీలో వచ్చిన ఫిర్యాదులు అవాస్తవం'

కామారెడ్డిటౌన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాల పోస్టుల భర్తీలో వచ్చిన ఫిర్యాదులు నిరాధారమైనవని ప్రిన్సిపల్ శివప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి వైద్యకళాశాలలో ఉద్యోగాల నియామకానికి సంబంధించి డీఎంఈ ఆఫీస్ నుంచి 50 పోస్టుల అనుమతి ఇవ్వడం జరిగిందని తెలిపారు. ప్రక్రియ అడిషనల్ కలెక్టర్ గారి పర్యవేక్షణలో, ఉపాధి కల్పనఅధికారి, ప్రిన్సిపల్ ప్రభుత్వ వైద్యకళాశాల, కామారెడ్డి మ్యాన్ పవర్ సర్వీసెస్ చేపట్టిన నియామకాలను పరిశీలించారని తెలిపారు. ఫిర్యాదులు నిరాధారమైనవన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై దృష్టి సారించాలి

కామారెడ్డిటౌన్,ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలపై ఇన్‌చార్జ్ డీఈవో అశోక్ దృష్టిసారించాలని ఉపాధ్యాయసంఘాల సమాఖ్య సభ్యులు కోరారు. బుధవారం జిల్లా విద్యాశాఖకార్యాయలంలో ఇంచార్జ్ డీఈవో అశోక్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఉపాధ్యాయులకు న్యాయబద్దంగా రావాల్సిన అన్ని అలివెన్స్‌లు వచ్చేలా చూడడంతో పాటు పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరి బలరాం, లచ్చయ్య, చైర్మన్ పంపరి ప్రవీణ్,ఆర్గనైజింగ్ సెక్రటరి దేవుల, పందిరిరాజేష్, రాజకుమార్ పాల్గొన్నారు.

'విశ్వకర్మలకు సహకారం అందించినందుకు ధన్యవాదాలు'

కామారెడ్డిటౌన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి):విశ్వకర్మల జీవనోపాధికి సహకారం అందించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నామని విశ్వకర్మపరిషత్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి సుదర్శన్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కాళికాదేవి ఆలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రతినిధులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై రైతుల ఆందోళన

● అధికారులతో మాట్లాడిన పోచారం



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం

కోటగిరి,ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండల కేంద్రంలోని చెక్‌పోస్టు వద్ద బుధవారం రైతులు ధాన్యం కొనుగోలులో జాప్యాన్ని నిరసిస్తూ రాస్తారోకో నిర్వహించారు. పోతంగల్, కల్లూర్ గ్రామాలకు చెందిన రైతులు పెద్దఎత్తున తరలివచ్చి చెక్‌పోస్టు వద్ద రోడ్డుపై బైఠాయించారు. పోతంగల్ సహకార సంఘం అధికారులు ధాన్యం కొనుగోళ్లపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గన్నీ బ్యాగుల కోసం రోజుల తరబడి ఎదురు చూడాల్సి వస్తుందన్నారు. తూకం వేసిన ధాన్యం తరలింపులో తీవ్రఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు వాపోయారు. లారీలు సకాలంలో రాక తూకం వేసిన ధాన్యంలో తేమశాతం తేడా వస్తుందని రైతులు తెలిపారు. మరోవైపు ధాన్యాన్ని కోటగిరి ఉమ్మడి మండలం కాదని ఇతర ప్రాంతాలకు కేటాయించడంతో లారీలు రావడం లేదన్నారు. హమాలీలు సరిపడలేకపోవడంతో ధాన్యం రాసులు పేరుకుపోయాయని వారు పేర్కొన్నారు. సమస్యను పరిష్కరించే వరకు రాస్తారోకో విరమించేది లేదని రైతులు స్పష్టం చేశారు. సాలూర మండల కేంద్రంలో ఓ కార్యక్రమం నిమిత్తం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి వెళ్తుండగా చెక్‌పోస్టు వద్ద రైతులతో మాట్లాడారు. సమస్యను అడిగి తెలుసుకున్నారు. కొనుగోళ్లలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. గన్నీ బ్యాగులు, హమాలీ, లారీల కొరత రైస్ మిల్లర్ల నిర్లక్ష్యంపై రైతులు ఫిర్యాదు చేశారు. ఈ సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే పోచారం సంబంధిత శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానికంగానే రైస్‌మిల్లులకు ధాన్యాన్ని అలాట్‌మెంట్ చేయాలని కోరారు. కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఎమ్మెల్యే హామీతో రైతులు రాస్తారోకోను విరమించారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



మోర్తాడ్ డిగ్రీ కళాశాలలో పాల్గొన్న విద్యార్థులు, లెక్చరర్‌లు

మోర్తాడ్ , ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మూడోసంవత్సరం విద్యార్థులకు, మొదటి, రెండో సంవత్సరపు విద్యార్థులతో ఫేర్‌వెల్ పార్టీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.పెద్దన్న మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్ధేశించుకోవాలని, అంకిత భావంతో క్రమశిక్షణతో కృషిచేయాలన్నారు. డిగ్రీలలో మొదటి, రెండోసంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు గోల్డ్‌మెడల్, ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన డాన్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సంవత్సరం రాష్ట్ర ఉత్తమ అధ్యాప కులుగా అవార్డు తీసుకున్న డాక్టర్ పెద్దన్నను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ మగ్రిపల్లి భూపతి, కో-ఆర్డినేటర్ దశరథ, ఎన్. రాజయ్య, టి.రవీందర్, అధ్యాపక, సిబ్బంది, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

జానకంపేట గ్రామంలో చోరీ

ఎడపల్లి, ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి) : మండలంలోని జానకంపేటలో మంగళవారం రాత్రి ఓ ఇంట్లో చోరీ జరిగింది. జానకంపేట గ్రామంలోని 7వవార్డులో నివసిస్తున్న పారిపల్లి శంకర్ కుటుంబసభ్యులు వేసవి కాలం కావడంతో తలుపులు తెరిచి నిద్రిస్తుండగా గాఢనిద్రలో ఉన్న సమయంలో గుర్తుతెలియని దుండగులు ఇంట్లో చొరబడి ఇంట్లోని బీరువాలో ఉన్న 3 తులాల బంగారంతోపాటు 5వేల నగదును దొంగిలించి, ఇంటి బయట పడుకున్న బాధితుడి భార్య మెడలో ఉన్న 3 తులాల పుస్తెల తాడును దొంగిలించి తీసుకెలుతుండగా అలికిడికి నిద్ర నుంచి తేరుకున్న కుటుంబసభ్యులు దొంగని వెంబడించారు. కాని దొంగ దొరక లేదు. ఎడపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బుధవారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకున్న ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి వివరాలు సేకరించారు.

రైతు మహోత్సవానికి భారీగా తరలివెళ్లిన రైతులు



జెండాఊపి ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ భరత్‌రెడ్డి

డొంకేశ్వర్ , ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి):జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన రైతుమహోత్సవ కార్యక్రమానికి డొంకేశ్వర్ మండల కేంద్రం, వివిధ గ్రామాల నుంచి రైతులను సొసైటీ ఆధ్వర్యంలో భారీగా తరలించారు. ఈ కార్యక్రమాన్ని సొసైటీ చైర్మన్ భరత్‌రెడ్డి జెండాఊపి ప్రారంభించారు. గ్రామాల వారిగా ఆదర్శ రైతులను తీసుకువెళ్లారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ భరత్‌రెడ్డి, వైస్‌చైర్మన్ మోర్తాడ్ ముత్యం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూమేష్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలి

● డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రాజశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రాజశ్రీ

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించాలని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రాజశ్రీ తెలిపారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని సందర్శించి డాక్టర్లతో రివ్యు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌వో రాజశ్రీ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు, గర్భిణులకు డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండాలని, వేసవికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు జరిగేలా చూడాలని, సాధారణ ప్రసవాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి డిఎంహెచ్‌వో రమేష్, ఆసుపత్రి సూపరిండెంట్ రవికుమార్, ఎన్‌సీహెచ్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుప్రియ, డాక్టర్ అపర్ణ, డాక్టర్ స్రవంతి, డాక్టర్ గీత, డాక్టర్ సతీష్ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి



సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆర్మూర్ టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల లోపు చిన్నారులకు తల్లిదండ్రులు, అంగన్‌వాడీ సెంటర్లలో పౌష్టికాహారాన్ని అందజేయాలని జిల్లా వెల్ఫేర్ అధికారి రసూల్‌బీ, మున్సిపల్ కమిషనర్ రాజులు తెలిపారు. బుధవారం పట్టణంలోని ఐసీడీసీఎస్ ఆర్మూర్‌సెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషణపక్షం ముగింపు కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ప్రతీరోజు పౌష్టికాహారం తీసుకోవడంతో పౌష్టికాహార లోపం అధిగమించి సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు సమయపాలన పాటిస్తూ పోషక విలువలు అదనపు ఆహార విశిష్టత, తల్లిపాలు ఆవశ్యకత, రక్తహీనతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలని, పౌష్టికాహార లోపంతో బాధపడే చిన్నారులను గుర్తించి తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి పౌష్టికాహారాలపై తెలియజేయాలని వారు సూచించారు. పౌష్టికాహార లోపంలేని గ్రామాలను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలని వారు సూచించారు. అనంతరం సీమంతాలు, అన్నప్రసన, ప్రీస్కూల్ గ్రాడ్యుయేషన్ నిర్వహించారు. కిషోరబాలికలు ఆటపాటలతో అలరించారు. పోషక విలువలపై కళాబృందంతో అవగాహన కల్పించారు.

ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య



బహుమతులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ బడులను బలోపేతం చేయడంలో భాగంగా విద్యార్థులకు అన్ని రకాల వసతులు సౌకర్యాలు కల్పిస్తున్నదని విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన కేవలం ప్రభుత్వ బడుల్లోనే అందుతుందదని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు బడులకు కాకుండా ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని కోనాపూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చౌడారపు రాంప్రసాద్ అన్నారు. బుధవారం స్కూల్ లాస్ట్ వర్కింగ్ డే సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెంజల్ : మండలంలోని దూపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలతో పాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల బృందం బుధవారం గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. రాబోయే విద్యా సంవత్సరానికి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించాలని తల్లిదండ్రులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వెంకట లక్ష్మీ, పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు సోమలింగం గౌడ్, ఉపాధ్యాయులు కృష్ణ, సాయన్న, ప్రభాకర్, సురేష్, రాజేశ్వర్, రాములు, రాధ, సంధ్య, లక్ష్మి పాల్గొన్నారు.

ఆలూర్ : ఆలూరు మండలం మిర్దపల్లి గ్రామంలో బుదవారం ప్రాథమిక పాఠశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు రాజశ్రీ మాట్లాడ్లారు. ఆలూర్ మండల విద్యాధికారి నరేందర్ మాట్లాడుతూ పాఠశాల తనకు ఎంతో ప్రత్యేకం అని పాఠశాల గొప్పతనాన్ని కొనియాడారు. అనంతరం పాఠశాల విద్యార్థినిల సాంస్కృతిక పరిశీలన అందరిని అలరించింది. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు,పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకొని మంచి ఫలితాలు సాధించి ఉన్నత స్థానాలు పొందాలని ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం రాత్రి జక్రాన్‌పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్‌డే నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు లింగన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. మండలంలోని బాల్‌నగర్ పాఠశాలలో 5, 7 వ తరగతి చదువుతున్న వరుణ్, స్వామిట్ విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుశమంజసా సన్మానించారు. బుధవారం పాఠశాలలో విద్యార్థులకు పత్రాలతో సత్కరించారు.

ఉగ్రదాడిపై నిరసనలు



బోధన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఆర్మూర్ టౌన్ , ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి):ఇటీవల కాశ్మీర్‌లోని పహాల్గాంలో జరిగిన ఉగ్రదాడిని న్యాయవాదులు తీవ్రంగా ఖండించారు. బుధవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఉగ్రదాడిలో మరణించిన వారికి సంతాపకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల శ్రీధర్, న్యాయవాదులు గంగారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, నర్సయ్య, నరేందర్, శ్రీధర్, క్రిష్టపం డిత్, జగదీశ్, కిష్టయ్య, సురేష్, విప్లవ్, గంగాధర్, మురళీధర్, జీవన్, అమితాబ్ కిరాడ్, శంకర్, విజయలక్ష్మీ, గణేష్, రాకేష్, చరణ్, సుకేష్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్ : జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిని పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా బుధవారం బోధన్‌లో హిందు ఐక్యవేదిక ఆధ్వర్యంలో కాగడాల ర్యాలీని నిర్వహించారు. మారుతి మందిరం నుంచి ప్రారంభమైన కాగడాల ర్యాలీ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా, కొత్త బస్టాండ్ ప్రధాన వీధుల గుండా కొనసాగింది. ఈ సందర్భంగా హిందు సంఘాల నాయకులు మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

నవీపేట : జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాం బైసరిన్ వ్యాలీలో మంగళవారం ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ బుధవారం రాత్రి మండల కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రధాన చౌరస్తా నుంచి స్వామి వివేకానంద విగ్రహం వరకు హిందూసంఘాల ఆధ్వర్యంలో ఈ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అమాయకుల ప్రాణాలు తీసిన దుండగులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఉగ్రవాదుల దాడుల్లో మృతిచెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని వారు ప్రార్థించారు. కార్యక్రమలో బీజేపీ, ఆర్ఎస్ఎస్, విశ్వహిందు పరిషత్‌లకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కమ్మర్‌పల్లి : కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడులను తీవ్రంగ ఖండిస్తూ బుధవారం రాత్రి కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భజరంగ్‌దళ్, ఆర్ఎస్ఎస్, బీజేపీ తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి : మండల కేంద్రంలోని శివాజీ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమలో బీజేపీ, గ్రామానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మెండోర :మండలంలోని బుస్సాపూర్ గ్రామంలో కొవ్వొతులతో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో యువకులు, తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్ : పట్టణ కేంద్రంలో కొవ్వొతులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆరే రవీందర్, యోగేశ్వర్, నర్సయ్య, మహిపాల్, ప్రమోద్, శ్రీనివాస్, రజనీకాంత్, సంధ్యరాజ్ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం



సాయికృష్ణ

బోధన్‌రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సాలూర మండలం హున్స గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి సాయికృష్ణ అదృశ్యమయ్యాడని కుటుంబసభ్యులు పేర్కొన్నారు. మంగళవారం ఇంటర్ పరీక్ష ఫలితాలు విడుదల కాగా, సాయికృష్ణ ఫెయిల్ అయ్యాడని అప్పటి నుంచి కనిపించడం లేదని తల్లిదండ్రులు తెలిపారు. సాయికృష్ణ పట్టణంలోని విజేత కళాశాలలో ఇంటర్ రెండోసంవత్సరం చదువుతున్నాడు. సెకండ్ ఇయర పరీక్షల్లో ఫెయిల్ అవడంతో కనిపించడం లేదని తండ్రి గంగాధర్ తెలిపారు. ఈ విషయంపై సీఐ మాట్లాడుతూ విద్యార్థి అదృశ్యం పట్ల పూర్తి విచారణ చేపడుతున్నామన్నారు. సీసీ ఫుటేజీల ద్వారా అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు.

కమిషనర్‌పై నిరాదరణ ఆరోపణలు చేయడం సరికాదు



నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

బోధన్‌రూరల్, ఏప్రిల్23 (ఆంధ్రజ్యోతి): బోధన్ మున్సిపల్ కమిషనర్‌పై నిరాదరణ ఆరోపణలు చేయడం సరికాదని బోధన్ మున్సిపల్ ఉద్యోగులు అన్నారు. బుధవారం బోధన్ మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. నిజాయితీ అధికారిని లక్ష్యంగా చేసుకుని ఆయన వ్యక్తిత్వాన్ని, సేవలను కించపర్చడం సరికాదన్నారు. అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ డీఈ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్‌పై అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న సీఐ

బోధన్‌రూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో డ్రైవింగ్‌పై బుధవారం డ్రైవర్‌లకు అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమాదాలు జరగకుండా వాహనాలు ఎలా నడిపించాలి, ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్ ఆటోడ్రైవర్లు, వాహన డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. కార్యక్రమంలో సీఐ వెంకట నారాయణ, ఆటో డ్రైవర్లు, వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలుశిక్ష

రెంజల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాటాపూర్ చౌరస్తాలో మంగళవారం రాత్రి రెంజల్ ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించగా ముగ్గురు వ్యక్తులను డ్రంక్ అండ్ డ్రైవ్‌లో అదుపులోకి తీసుకున్నారు. మహారాష్ట్రలోని బెల్లూర్ గ్రామానికి చెందిన గజానన శివాజీ రౌంటే, తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన షేక్‌ఫైదు, వీరన్నగుట్ట గ్రామానికి చెందిన వీరబత్తుల సాయిలును కోర్టులో ప్రవేశపెట్టగా సెకండ్ క్లాస్ జడ్జి శేషతల్ప సాయి ముగ్గురికి రెండు రోజుల జైలుశిక్షతో పాటు 4వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెలురించారని ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. మండలంలో ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పేకాట స్థావరంపై దాడి

రెంజల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దూపల్లి గ్రామంలో రహస్యంగా పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు రెంజల్ ఎస్ఐ చంద్రమోహన్ సిబ్బందితో కలిసి దూపల్లి గ్రామ శివారులో గల కల్లు దుకాణం పక్కన పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 11,820 రూపాయలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. గ్రామంలో ఎవరైనా పేకాట ఆడినట్లు సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

చెట్లను పరిశీలించిన ఫారెస్టు అధికారులు

ఎడపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఠాణా కలాన్ గ్రామశివారులోని రాధ అనే రైతు పొలంలో సుండు యాదగిరి అనే వ్యక్తి అక్రమంగా చెట్లను నరికివేసి, సతీష్ అనే కౌలు రైతుపై దాడి చేయడంతో జిల్లా పోలీస్ కమిషనర్‌కు ఆమె ఫిర్యాదు చేశారు. బుధవారం ఫారెస్టు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పొలం గట్టుపై ఉన్న నీలగిరి చెట్టు నరికివేసి ఉందని ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

గంజాయి పట్టివేత

భీమ్‌గల్ రూరల్, ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి):మండలంలోని బడాభీమ్‌గల్ గ్రామంలో బుధవారం ఎంజీతాండా క్రాస్ రోడ్‌లో పెట్రోలింగ్ చేస్తుండగా ద్విచక్ర వాహనంలో 364 గ్రాముల ఎండు గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు భీమ్‌గల్ ఆబ్కారీ ఎస్సై వేణుమాధవ్‌రావు తెలిపారు. బైక్‌ను సీజ్ చేసి అతనివద్ద ఉన్న నాలుగు మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే భీమగల్ మున్సిపల్ పరిధిలో గంజాయికీ బానిసైన మైనర్‌ల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

కందకుర్తిలో ప్రమాదాల నివారణకు చర్యలు

రెంజల్,ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి): కందకుర్తి గోదావరి వద్ద మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం వద్ద చెక్‌పోస్టు వద్ద ప్రమాదకర మలుపు ఉండడంతో పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయన్న సమాచారం మేరకు రెంజల్ ఎస్ఐ చంద్రమోహన్ తన సిబ్బందితో కలిసి రోడ్డుపై ఉన్న ఇసుక దిబ్బలను తొలగించి, బారికేడ్లు, డబ్బాలను అమర్చి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. దీంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు. మూలమలుపు వద్ద ఎన్నో ప్రమాదాలు జరిగాయని రోడ్డుపై ఉన్న ఇసుక దిబ్బెలను తొలగించడంతో వాహనదారులకు ప్రమాదం తప్పిందని వాహనదారులు పోలీసుల తీరు పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ఎంపీడీఓ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే

ఎల్లారెడ్డిరూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అన్నాసాగర్ గ్రామంలో బుధవారం ఎల్లారెడ్డి ఎంపీడీఓ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్లను సర్వేనిర్వహించారు. సర్వేలో భాగంగా పక్క ఇండ్లులేని నిజమైన లబ్దిదారులను గుర్తించడానికి గ్రామంలోని వీధుల్లో పర్యటించి గుడిసెలు, రేకులషెడ్లు, అద్దెఇల్లు, శిథిలావస్థలో ఉన్న ఇండ్లను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో ప్రకాష్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన లబ్ధిదారులకు అందించడానికి కృషిచేస్తుందని తెలిపారు. పేదలందరికీ సొంత ఇంటికల నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇండ్లను నిర్మించుకుని ప్రభుత్వం అందించే సహకారాన్ని పొందాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామకార్యదర్శి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



ధర్పల్లిలో శిథిలావస్థకు చేరిన పశు వైద్యశాల

శిథిలావస్థలో పశువైద్యశాల

• ధర్పల్లిలో మూగజీవాలకు అందని వైద్యం

ధర్పల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల పశువైద్యశాల శిథిలావస్థకు చేరుకుంది. భవనం శిథిలావస్థకు చేరుకున్న ప్పటికీ అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ స్పందించడంలేదు. భవనం కూలిపోవ డానికి సిద్ధంగా ఉండటంతో ఇక్కడ పనిచేసే సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. మండలంలో 22 గ్రామ పంచాయతీలు ఉండగా వీటన్నింటికీ మండల కేంద్రంలో గల పశువైద్యశాల ఒక్కటే ఉంది. మండలంలో పశు సంపద పాడి పరిశ్రమ అధికంగా ఉన్నప్పటికీ అధికారులు అందించడం లేదు. ఇటువైపు కన్నెత్తి చూడటం లేదని పాడి రైతులు అంటున్నారు. ఇక్కడ పనిచేసే వైద్య సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో పశువులు అనారోగ్యానికి గురవుతున్నారు. ప్రైవేటు మెడికల్ షాపులను పాడి రైతులు ఆశ్రయించి పశువులకు సంబంధించి జబ్బులకు ఔషధాలు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. సొంత చికిత్స పైనే రైతులు ఆధారపడి ఉంటున్నారు. మండల కేంద్రంలో గల ఈ భవనం కనీసం 70 సంవత్సరాల క్రితం నిర్మించి ఉంటుందని గ్రామానికి చెందిన రైతులు అంటున్నారు. సిబ్బంది రాక పోవడంతో ఇక్కడ పశువైద్య పరిసర ప్రాంతాలు దుర్గంధ భరితంగా మారాయి. మండలంలో గొర్రెలు, గేదెలు, మేకలు, ఆవులు ఇతర పశు సంపద ఇతర మండలాలతో పోలిస్తే అధికంగానే ఉంది. అయినప్పటికీ ఆ స్థాయిలో వైద్యసదుపాయం అందడం లేదు. ఏళ్ల తరబడి మూగజీవాలకు వైద్యం అందని ద్రాక్ష లాగే ఉంటుంది. మండలంలో రామడుగు, మైలారం, దుబ్బాక, ఒన్నాజిపేట్ గ్రామాల్లో పాడిసంపద అధికంగా ఉంది. అక్కడి నుంచే పశువులకు వ్యాధులు సోకితే ఇక్కడికి రావాలంటే రైతులు ఇబ్బందులు తప్పడం లేదు. కనీసం పశుసంపద ఎక్కువగా ఉన్న గ్రామాల్లో గోపాలమిత్ర కేంద్రాలను ప్రారంభించాలని రైతులు అంటున్నారు. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో స్లాబ్ పెచ్చులు ఊడి కిందపడుతున్నాయి. భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. నట్టల నివారణ మందులు వేసేటప్పుడు మాత్రమే వైద్య సిబ్బంది కనిపిస్తారని తదనంతరం వైద్య సిబ్బంది కనిపించకుండా పోతారని వైద్యశా లకు వెళ్లినకానీ సిబ్బంది ఉండరని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి శిథిలావస్థకు ఉన్న ధర్పల్లి పశువైద్యశాల కోసం నూతన భవనం నిర్మించాలని వైద్యసిబ్బందిని నియమించి సమయపాలన పాటించేలా చూడాలని కోరుతున్నారు.

వెళ్లాలంటే భయమేస్తోంది

● మిట్టపల్లి వెంకట్‌రెడ్డి



గ్రామంలో గల పశువైద్యశాలకు వెళ్లాలంటే భయమేస్తోంది. చాలా రోజుల నుంచి ఆసుపత్రిని పట్టించుకునే నాథుడే లేడు. గ్రామంలో పశు సంపద ఉన్నప్పటికీ వైద్యసిబ్బంది లేక పోవడంతో రైతులు ప్రైవేటు మెడికల్లను ఆశ్రయిస్తున్నారు. వైద్య సిబ్బందిని నియమించి సమయపాలన పాటించాలి.

ప్రతిపాదనలు పంపాం

• అభిషేక్, పశువైద్యాధికారి



ఆసుపత్రి భవన నూతన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. ఆసుపత్రి శిథిలావస్థలో ఉన్న విషయాన్ని ఉన్నతాధికారులకు వివరించాం. వర్షాకాలంలో ఆసుపత్రిలో ఉన్న పశువుల దాణ తడిసి పోతోంది. గతంలో సైతం ఇక్కడ పనిచేసిన వైద్యులు నూతన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించారు. త్వరలోనే భవన నిర్మాణానికి నిధులు మంజూరు అవుతాయని ఆశిస్తున్నాం.

వేసవి సెలవుల్లో పిల్లలు జాగ్రత్త!

● ప్రమాదకరంగా మారిన 'డబుల్' గుంతలు ● పిల్లర్ల కోసం 8 ఏళ్ల క్రితం తవ్విన గుంతలు
● గుంతలతో పొంచి ఉన్న ప్రమాదం ● పట్టించుకోని అధికార యంత్రాంగం

బోధన్‌రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాల కోసం తవ్విన గుంతలు ప్రమాదకరంగా మారాయి. బోధన్ పట్టణ శివారులోని ఆటో నగర్‌లో 8 ఏళ్ల క్రితం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాల కోసం తవ్విన గుంతలు నేటికి అలాగే ఉన్నాయి. మట్టితో పూడుకుని ఉన్న భూమి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణానికి పనికి రాదని ఇంజనీర్లు తేల్చి చెప్పడంతో ఆ పనులు అక్కడికక్కడే అప్పుడే ఆగిపోయాయి. దీంతో అధికార యంత్రాంగం చేపట్టిన పనులకు పిల్లర్లకే ఆగిపోగా అప్పటి నుంచి ఆ గుంతలు అలాగే ఉండిపోయాయి. వర్షాకాలంలో వర్షాలతో పాటు పిల్లర్లు నిండి రోడ్డుపై నీరు ప్రమాదకరంగా ప్రవహిస్తు ఉంటుంది. ఏ కాలం అయిన పిల్లర్ల గుంతల్లో నీరు నిలిచి ప్రమాదకరంగా ఉంటుంది. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాల కోసం తవ్విన గుంతలు ప్రమాదకరంగా మారాయి. పరిసరా ప్రాంతాల్లో ఉన్న ప్రజలు ఈ గుంతల పక్కనే ఉన్న రోడ్డు నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. చుట్టు ఇళ్లు కట్టడంతో చిన్నారులు సాయంత్రం పూట గుంతల పరిసరా ప్రాంతాల్లో ఆడుకుంటారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పిల్లర్ల నిర్మాణం చుట్టూ కనీసం నిర్మాణం అయిన చేపట్టకపోవడంతో అటు వైపు వెళ్లే వారు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రిపూట రోడ్డు గుండా అటు వైపు కాలనీలకు ప్రజలు భయాందోనలతో వెళ్తున్నారు. 8ఏళ్లు గడిచినా పిల్లర్ల గుంతలు పూడ్చకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. కాలనీవాసుల చిన్నారులు ఆడుకుంటున్నప్పుడు ఏదైనా జరగరాని సంఘటన జరిగితే దానికి బాధ్యతలు ఎవరని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. గత ఏడాది బాన్సువాడ మండలం కొత్తబాది ప్రాథమిక పాఠశాలలో ఓ చిన్నారి ప్రమాదవశాత్తు సమీపంలోని నీటి గుంతలో పడి మృతి చెందిన సంఘటన అందరికి తెలిసిందే, పాఠశాల ప్రాంగణంలో బాలుడికి తల్లి గోరుముద్దలు తినిపించి ఇంటికి వెళ్లింది. సాయంత్రం ప్రమాదవశాత్తు కొత్తబాది పాఠశాల సమీపంలో ఉన్న గుంతలో పడి బాలుడు మృతి చెందాడు. మధ్యాహ్నం గోరుముద్దలు పెట్టి సాయంత్రం బాలుడి మృతదేహం ఇంటికి రావడంతో ఆ తల్లిని ఓదార్చడం ఎవరి తరం కాలేదు. ఇలాంటి ఘటన చోటు చేసుకోకుండా ముందస్తుగా జాగ్రత్తలు చేపట్టాల్సిన అవసరం అధికారులకు ఎంతైనా ఉంది.

● అధికారుల నిర్లక్ష్యంతోనే..

బోధన్‌లోని ఆటో నగర్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం గుంతలు తవ్వి 8ఏళ్లు అవుతుంది. పనులు ఆపేసిన వెంటనే గుంతలను పూడ్చివేయాల్సి ఉండగా నీటి, పిల్లర్ల గుంతలను పూడ్చకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనికి అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యమేనని కాలనీవాసులు వాపోతున్నారు. పరిసరా ప్రాంతాలలో ఇళ్ల నిర్మాణాలు ఉన్నాయని, చిన్నారులు సాయంత్రం పూట చల్ల గాలులకు ఈ చుట్టు పక్కల ఆడుకుంటారని ఏదైనా జరగరాని సంఘటన జరిగితే దానికి అధికారులదే బాధ్యత అని కాలనీవాసులు పేర్కొంటున్నారు. బాన్సువాడ కొత్తబాది వద్ద జరిగిన ఘటన పునరావృతం కాకముందే బోధన్ ఆటో నగర్ వైపు అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, వెంటనే పిల్లర్ల నిర్మాణం చుట్టు కంచెను ఏర్పాటు రేయాలని కోరుతున్నారు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి శాశ్వత చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు. లేనిపక్షంలో తామే ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని కలిసి తమ బాధలను తెలియజేసుకుంటామని కాలనీవాసులు కోరుతున్నారు.



డబుల్ ఇళ్ల కోసం తవ్వి పిల్లర్లు వేసి వదిలేసిన గుంతలు

ప్రమాదకరంగా గుంతలు

●ఎండీ అజార్, ఆటోనగర్



ఆటో నగర్‌లో పిల్లర్ల వద్ద నిలిచిన నీరు ప్రమాదకరంగా మారాయి. రాత్రి సమయంలో అటు వైపు ద్విచక్ర వాహనదారులు వెళ్లాలంటే భయపడుతున్నారు. అదుపు తప్పి ఏదైనా జరిగితే ప్రాణాలు పోయే పరిస్థితి నెలకొంది. పిల్లర్ల చుట్టు కంచెను ఏర్పాటు చేయాలి.

పిల్లలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలి

● మహబూబ్ ఖాన్, ఆటోనగర్



పిల్లర్ల వద్ద వర్షపు నీరు ఉండడంతో ఆ చోటు ప్రమాదకరంగా మారింది. చుట్టు పక్కల నివసించే పిల్లలు అక్కడ ఆడుకోవడంతో మాకు భయం వేస్తుంది. అధికారులు స్పందించి పిల్లర్ల వద్ద నిలిచిన నీటిని తొలగించి పిల్లర్ల చుట్టు కంచెను ఏర్పాటు చేసి కాలనీవాసులను, చిన్నారులను కాపాడాల్సి బాధ్యత అధికారులపై ఉంది.

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం

●బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో



బోధన్ పట్టణంలోని ఆటోనగర్ వద్ద డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం తవ్విన ప్రమాకర గుంతల విషయమై సబ్ కలెక్టర్ వికాస్ మహతోను వివరణ కోరగా త్వరలో సందర్శించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడతామన్నారు.

ఆర్మూర్‌లో కుక్కల స్వైర విహారం

● చిన్నారులపై కుక్కల దాడులు
● భయాందోళనలో పట్టణ ప్రజలు

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. కుక్కలు ఎక్కువ కావడంతో ఒకేచోట గుంపుగా ఉండడంతో అటు వైపుగా వెళ్లాలంటే పెద్దలు కూడా భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. తాజాగా ఆర్మూర్ పట్టణంలో తన ఇంటిముందు నిలబడిన ఐదేళ్ల బాలుడిపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. ఇటీవల పట్టణంలోని రాజారాంనగర్‌లో ఇంటిముందు ఆడుకుంటున్న ఓబాలుడిపై దాడి చేయడంతో తీవ్రంగా గా యపడ్డాడు. అదే రోజు మరో ముగ్గురిని కుక్కలు కరిచి గాయ పరిచాయి. దీంతో తమ పిల్లలను ఒంటరిగా భయటకుపంపాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారు. పాఠశాలలకు వెళ్లే సమయంలో, తిరిగి ఇంటికి వచ్చే సమయంలో తల్లిదండ్రులు తమ పిల్లలను జాగ్రత్తగా గమనించాల్సి వస్తుంది.

అంకాపూర్‌లో ఒకేరోజు ఏడుగురిని ..

ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో ఇటీవల ఓ పిచ్చికుక్క ఒకే రోజు ఆరుగురిని కరిచి గాయపరిచింది. ఉదయం వేళలో మహిళలు తమ ఇంటి ముందు పనులు చేసుకుంటుండగా కుక్క దాడికి పాల్పడింది. కనబడిన ప్రతీవారిని కరుచుకుంటూ వెళ్లి ఏడుగురిని గాయపరిచింది. ఈ దాడిలో ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయ పడగా ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు. అదే విధంగా ఆలూర్ మండల కేంద్రంలో ఇటీవల కుక్క దాడిలో తొమ్మిది మంది గాయపడ్డారు. ఇక్కడ కూడా ఒకేరోజు కుక్క తొమ్మిదిమందిని గాయపరిచింది. క్షతగాత్రులను దేగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స చేయించారు. ఆర్మూర్ మండలం చేపూర్‌లో పిచ్చి కుక్క స్వైర విహారం చేసి ఒకేరోజు ఆరుగురిని గాయపరిచింది. వీరిలో ఇద్దరు ఆసుపత్రిలో చేరి చికిత్స చేయించుకోవాల్సి వచ్చింది. కుక్క కాటుకు గురైనవారు అది మంచిదైన, పిచ్చికుక్క అయిన సరైన చికిత్స చేయించుకోవాల్సిందే. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్న ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది.



కుక్కల దాడిలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళ (ఫైల్)



కుక్కల దాడిలో గాయపడిన బాలుడు (ఫైల్)



దేగాం ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటున్న ఆలూర్ వాసులు



వీధి కుక్కలు

కుక్కలను నియంత్రించేదెలా ..

గ్రామాలు, పట్టణాలు వివిధ కాలనీల సైతం కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. కొన్ని చోట్ల కుక్కలు గుంపులు గుంపులుగా ఉంటున్నాయి. అటువంటి సమయంలో పెద్దవారు కూడా అటువైపుగా వెళ్లాలంటే భయపడాల్సి వస్తుంది. గతంలో గ్రామ పంచాయతీ, మున్సిపల్ సిబ్బంది కుక్కలను నియంత్రించేవారు. ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేకుండా పోయాయి. కొన్ని జిల్లాలో కోతుల బెడద సంఖ్య ఎక్కువ కావడంతో వాటికి అక్కడి అధికారులు కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు చేయించిన సందర్భాలున్నాయి. అదే మాదిరిగా గ్రామాల్లో శునకాలను నియంత్రిం చడానికి వాటికి కూడా కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు జరిపిస్తే వాటి సంఖ్యను అదుపులో ఉంచవచ్చని, దీనిద్వారా చిన్న పిల్లలు, వృద్ధులను కుక్కల భారి నుంచి కాపాడినవారమవుతామని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

నాగిరెడ్డిపేటలో కోతుల బెడద

● ఇబ్బందులు పడుతున్న జనం

నాగిరెడ్డిపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో కోతులు బెడద అధికమైంది. మండల కేంద్రంలో పాటు, మండలంలో ఏ గ్రామంలో చూసిన కోతుల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అడవుల్లో ఉండాల్సిన కోతులు అడవులను వదిలి అవి గ్రామాల బాట పట్టాయి. గత కొన్ని సంవత్సరాలుగా కోతులు గ్రామాల్లోని మకాం వేశాయి. గ్రామాల్లో వందలాది కోతులు నిత్యం తిరుగుతూ దర్శనమిస్తున్నాయి. ఇళ్ల చుట్టూ తిరుగుతూ ఇళ్లలోకి చొరపడి ఇండ్లలోంచి ఆహార పదా ర్థాలను, తినుబండారాలను ఎత్తుకెళ్తున్నాయి.



నాగిరెడ్డిపేట బస్టాండ్ వద్ద రోడ్డు దాటుతున్న కోతులు

● ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలోనూ కోతుల బెడద

మండల కేంద్రంలోని ఆయా ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలోనూ కోతులు బెడద అధికమైంది. మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, ఉపాధి హామీ కార్యాలయం, ఐకెపి కార్యాలయం, బస్టాండ్ ఆవరణలోనూ కోతుల బెడదతో ప్రజలు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిషత్, తహసిల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న చెట్ల పైన కోతులు నిత్యం తిరుగుతున్నాయి. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో కోతుల బెడదను నివారించాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు.

సమాజంలో ప్రతీఒక్కరు భక్తి భావన అలవర్చుకోవాలి

● మల్లారం లింగేశ్వర గుట్ట ఆశ్రమ వ్యవస్థాపకుడు బాలయోగి పిట్ల కృష్ణ మహరాజ్

ఎడపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతీఒక్కరు భక్తి భావనలు అలవర్చుకుని ధర్మ మార్గంలో నడుచుకోవాలని మల్లారం లింగేశ్వర గుట్ట ఆశ్రమ వ్యవస్థాపకుడు బాలయోగి పిట్ల కృష్ణ మహరాజ్ అన్నారు. ఎడపల్లి మండలంలోని వడ్డాపల్లి గ్రామంలో గల ఆత్మ లింగేశ్వర శివాలయం 13వ వార్షికోత్సవాన్ని బుధవారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్లారం లింగేశ్వర గుట్ట ఆశ్రమ వ్యవస్థాపకుడు శ్రీ పిట్ల కృష్ణ మహరాజ్ హాజరై పూజలు నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా ఉదయం నుంచి ఆలయంలో రుద్రాభిషేకం నిర్వహించి, 216 కలశాలతో ఆలయ శిఖరానికి కుంబాభిషేకం నిర్వహించారు. అదేవిధంగా ఆలయ ప్రాంగణంలో యజ్ఞం నిర్వహించి, మహిళలతో కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం ఆయన భక్తులనుద్దేశించి మాట్లాడుతూ సమాజంలో ప్రతీ ఒక్కరు సత్ప్రవర్తన కలిగి స్త్రీల పట్ల గౌరవంతో మెదులుతూ భక్తి భావనలు అలవర్చుకుని ధర్మమార్గంలో నడుచుకోవాలని సూచించారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తదితరులు పా ల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న పిట్ల కృష్ణ మహరాజ్

భానుడి భగ.. భగ

● రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ● పిల్లలు, వృద్ధులకు తీవ్ర ఇబ్బందులు
● జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్య నిపుణులు

మద్నూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): భానుడి భగ భగ మండుతున్నాడు. ఉదయం 10 దాటగానే క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. చిన్నారులు, వృద్ధులు, మహిళలు ఎండను తట్టుకోలేక పోతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే మే నెల వేసవిని తలచుకుంటే సూర్యుడి ప్రభావం ఏ విధంగా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈసారి 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. రహదారులు మధ్యాహ్నం సమయం కాగానే ఖాళీగా కనబడుతున్నాయి. వాహన దారుల రద్దీ తగ్గుతుంది. ఉదయం 10 లోపు పనిని ముగించుకుని ఇంటి బాట పడుతున్నారు. పెరుగుతున్న ఎండ వేడిమి నుంచి సంరక్షించుకోవడానికి ప్రయాణీకులు, వాహనదారులు, చిరు వ్యాపారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బయటకు వెళ్లేటప్పుడు తలపై తెల్ల రుమాలు, టోపీ, గొడుగు వాడుతున్నారు. ఇండ్లలో వేసవి ఉపశమనం కోసం మజ్జిగ, నిమ్మకాయ, పుచ్చకాయ, దోసకాయ, కీరదోస తదితర ద్రవ పదార్థాలు ఆహారంగా తీసుకుంటూ కొంత మేర ఉపశమాన్ని పొందుతున్నారు. వేడి ఎక్కువగా ఉండటంతో చిన్నారులు, వృద్ధులు, మహిళలు ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారు. కొబ్బరి బొండం, మట్టి కుండల అమ్మకం, టోపీలు, ఫ్రూట్ జ్యూస్, శీతల పానీయాల వ్యాపారులు వేసవి సీజన్‌లో ఉపాధి పొందుతున్నారు. ఉదయం 11 గంటల లోపే పనులు ముగించుకుని నీడ పట్టున చేరాలని సాయంత్రం నాలుగు గంటల తరువాత బయటకు వెళ్లాలని, సాధ్యమైనంత వరకు మంచినీరు ఎక్కువగా తాగాలని, కాటన్ దుస్తులు ధరించాలని వైద్యులు సూచిస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ వడదెబ్బ ని వారణ కోసం ముందస్తు చర్యల్లో భాగంగా ప్రజలకు అప్రమత్తం చేస్తుంది. ఆసుపత్రుల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్ల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచి పంపిణీ చేస్తున్నారు.





ఎండ వేడిమి నుంచి రక్షణకు రుమాలు ధరించి వెళ్తున్న ప్రజలు

● ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతుంది. వడదెబ్బకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముందు జాగ్రత్త చర్యలు పాటించాలని వడదెబ్బపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. ప్రభుత్వం సరఫరా చేసిన ఓఆర్ఎస్ ప్యాకెట్లు సబ్ సెంటర్ల పరిధిలో ఇంటింటికి పంపిణీ చేస్తున్నామని ఓఆర్ఎస్ పౌడర్‌ను నీళ్లలో కలుపుకుని తాగితే వడదెబ్బ భారిన పడకుండా ఉండవచ్చని సూచిస్తున్నారు.

- శ్రీలేఖ, డొంగ్లి వైద్యురాలు



కార్యక్రమంలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్, టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు వనమాలకృష్ణ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌లు పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సన్నాహక జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం జరిగిందని వీటికి వ్యతిరేకంగా ఇప్పటికే కార్మిక సంఘాలు ఆందోళన నిర్వహించినప్పటికీ మోదీ ప్రభుత్వం రద్దు చేయలేదన్నారు. కార్మికులకు కనీస వేతనాలు 26వేలు అమలు చేయాలని, మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రమేష్‌గౌడ్, విజయలక్ష్మి, ఖాజామొయినొద్దీన్, నర్సింగ్‌రావు, నూర్జహాన్, సుధాకర్, భూమయ్య, ఓమయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ భరోసాను అమలు చేయాలి

● ఏఐపీకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

ధర్పల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇస్తామన్న ఆత్మీయ భరోసాను కాలయాపన చేయకుండా వెంటనే అమలు చేయాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ఏఐపీకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు కిషన్ అధ్యక్షతన మండల కేంద్రంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం వ్యవసాయ కార్మికుల పట్ల సవతితల్లి ప్రేమను చూపుతుందన్నారు. ప్రధాని మోదీ వ్యవసాయ కూలీల పట్ల ప్రత్యేకమైన కార్యాచరణ తీసుకోలేదని అన్నారు. వ్యవసాయ కార్మికులు అంటేనే ప్రధానికి చిన్న చూపని కేవలం ఓట్ల కోసం మాత్రమే ఆయన కబుర్లు చెబుతారని అన్నారు. దేశంలో వ్యవసాయ కార్మికులు పనులు లేక అర్ధాకలితో అలమటిస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలో భాగంగా ఆత్మీయ భరోసా రూ.12 వేలు ఇస్తామని గ్రామసభలు పెట్టి అర్హుల లిస్ట్ ప్రకటించిన ఇప్పటి వరకు చిల్లిగవ్వ ఇవ్వలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, కిశోర్, అబ్బన్న, రాంజి, కిశోర్, రాజు, ఎర్రన్న, దయాల్‌సింగ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన వాయిదా

సుభాష్‌నగర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి):నగర పాలక సంస్థ పరిధిలో రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల పరిశీలన వాయిదా వేస్తున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 24, 25, 26 తేదీల్లో దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని కొన్ని కారణాల వల్ల వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తుల పరిశీలనకు తదుపరి తేదీలను తిరిగి ప్రకటిస్తామన్నారు.

నలంద హైస్కూల్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



పాల్గొన్న విద్యార్థులు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని న్యాల్‌కల్ రోడ్‌లోగల నలంద హైస్కూల్‌లో ప్రీప్రైమరీ నుంచి ప్రైమరీలోకి అడుగుపెడుతున్న విద్యార్థులకు బుధవారం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యక్షుడు అట్లూరి మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులలో చదువుపట్ల ఆసక్తిని పెంచి భవిష్యత్తుకు మంచి పునాదిని వేయడమే దీని ముఖ్య ఉద్దేశం అని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల గౌరవ అధ్యక్షుడు నంగునూరు ప్రకాశం, సెక్రెటరీ ఇంగు శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ నేహా, ప్రధానోపాధ్యాయులు పద్మావతి, ప్రిన్సిపల్ తనుజ, వైస్ ప్రిన్సిపల్ మురళి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం పాఠశాలకు చెందిన 2022-23 బ్యాచ్‌కు చెందిన అంబటి శర్వాణి ఇంటర్‌లో 993/1000 మార్కులు సాధించినందుకు అభినందించారు.

బీఆర్ఎస్‌లో చేరిన కేవీపీఎస్ జిల్లా నాయకులు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న బాజిరెడ్డి జగన్

సిరికొండ ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : సిరికొండ మండలం మైలారం గ్రామానికి చెందిన మల్యాల సుమన్ బుధవారం బీఆర్ఎస్ పార్టీలో చేరగా మాజీ జడ్పీటీసీ సభ్యులు పార్టీ ఇన్‌చార్జ్ బాజిరెడ్డి జగన్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. సుమన్ కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘంలో 2007 నుంచి పనిచేస్తున్నాడు. ఎస్ఎఫ్ఐలో నాయకుడిగా పనిచేసి ముఖ్యమంత్రిగా కేసీఆర్ చేసిన మంచి పనులకు ఆకర్షితుడై బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు శ్రీనివాస్ తెలిపారు.

సిరికొండలో విద్యార్థుల ర్యాలీ

సిరికొండ ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను, వస్తువులను వాడొద్దని కోరుతూ సిరికొండ మండల కేంద్రంలో మోడల్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ తీశారు. ప్లాస్టిక్ వాడకాన్ని నివారించాలని కోరుతూ మాడల్ స్కూల్ విద్యార్థులు ర్యాలీగా వ్యాపార సంస్థల వద్దకు వెళ్ళి యజమానులను వేడుకున్నారు. ప్లాస్టిక్ వాడడం వల్ల పర్యావరణం దెబ్బతింటుందని విద్యార్థులు వివరించారు. దుకాణాల్లో ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలను వారికి వివరించారు. వారి వెంట ఉపాధ్యాయులు జమున,సాయి వినయ్,గంగారాజు,పీడీ కిషన్ తదితరులు ఉన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

త్వరలో టీయూలో ఇంజనీరింగ్ కళాశాల

● అభివృద్ధి కాంగ్రెస్ అభిమతం
● నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

డిచ్‌పల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను త్వరితగతిన నెరవేర్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో చొరవ చూపతుందని ఇందులో భాగంగానే నిజామాబాద్ జిల్లాలోని తెలంగాణ విశ్వవిద్యాలయంలో త్వరలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసేందుకు అనుమతి ఇచ్చిందని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. బుధవారం డిచ్‌పల్లి మండలంలోని మిట్టపల్లి, రాంపూర్, కమలాపూర్, కొత్తపేట్, ఖిల్లా డిచ్‌పల్లి, ఘన్‌పూర్ గ్రామాల్లో 10కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి రూరల్ ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుతో పేద విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని, పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించడమే ప్రభుత్వ ధ్యేయం అన్నారు. ధరణి పేరుతో కోట్లాది రూపాయలను కొల్లగొట్టిన బీఆర్ఎస్ సర్కార్‌కు రజతోత్సవాలు జరుపుకునే అవకాశం ఎక్కడిదన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భవించి 25 ఏళ్ల గడిచిందా అని ఆయన ప్రశ్నించారు. పేద ప్రజానికానికి సన్నబియ్యం అందిస్తున్న ఘనత రేవంత్‌రెడ్డి సర్కార్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలోనే నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుంచేందుకు ప్రత్యేక చొరవ చూపుతున్నారని ఇందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోలసాని శ్రీనివాస్, సొసైటీ చైర్మన్‌లు తారాచంద్ నాయక్, మునిపల్లి సాయరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కంచెట్టి గంగాధర్, ధర్మాగౌడ్, లచ్చమొల్ల దత్త్రాద్రి, యానంపల్లి మురళి, చిన్నిందుల చిన్నయ్య, డాక్టర్ షాదుల్లా, రామకృష్ణ, పెద్దోళ్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



చేపల మార్కెట్‌ను ప్రారంభిస్తున్న రూరల్ ఎమ్మెల్యే

చైర్మన్‌గా జంగం శాంతయ్య ప్రమాణస్వీకారం

మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి చారిత్రాత్మక రామాలయం నూతన చైర్మన్‌గా బుధవారం జంగం శాంతయ్య పదవీ బాధ్యతలు రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి సమక్షంలో చేపట్టారు. ఈ సందర్భంగా చైర్మన్, డైరెక్టర్లు ప్రమాణస్వీకారం చేశారు. చైర్మన్ శాంతయ్య మాట్లాడుతూ నిస్వార్థంగా రామాలయ అభివృద్ధి ధ్యేయంగా తాను పనిచేస్తానని పేర్కొన్నారు. రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ రామాలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చొరవ చూపుతున్నానని ఇటీవలే రాష్ట్ర చైర్మన్ ఏకోటూరిజం ప్రతినిధులు రామాలయాన్ని సందర్శించారని అన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు మాధురి, పోశెట్టి, నర్సారెడ్డి, జితేందర్, సునీల్‌కుమార్ దేశ్‌పాండేలతో ఆలయ పరిశీలకురాలు కమల ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు పోలసాని శ్రీనివాస్, అమృతాపూర్ గంగాధర్, సుదర్శన్, సాయరెడ్డి పాల్గొన్నారు.

'పర్యాటకులపై ఉగ్రమూకల దాడి సరికాదు'



మాట్లాడుతున్న దేగాం యాదాగౌడ్



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

డిచ్‌పల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి):జమ్మూకాశ్మీర్‌లో మంగళవారం పర్యాటక ప్రాంతాలను పరిశీలించేందుకు వచ్చిన పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులు జరపడం తగదని, అమాయకుల ప్రాణాలు పొట్టనపెట్టుకోవడం శోచనీయమని ఏబీవీపీ తెలంగాణ యూనివర్సిటీ శాఖ నాయకులు ఖండించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయంలో ఉగ్రమూకల దిష్టిబొమ్మను దహనం చేసి నినాదాలు చేశారు. దాడికి పాల్పడిన ఉగ్రమూకలు ఎంతటివారైన కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సుభాష్‌నగర్ :జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రమూకల దాడిలో మరణించిన వారిపట్ల టీడీపీ ఆధ్వర్యంలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. జిల్లా కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ పార్లమెంట్ కన్వీనర్ దేగాం యాదాగౌడ్ మాట్లాడుతూ దేశంలో ఉగ్రవాదులను ఏరిపారేయాలని అన్నారు. దేశంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. జమ్మూకాశ్మీర్‌లో ఇలాంటి ఘటనలు జరిగితే టూరిజం పడిపోయి దేశానికి చెడ్డపేరు వస్తుందని, ఆర్థికంగా నష్టం జరుగుతుందన్నారు. ఉగ్రవాదులపై కేంద్రం కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో బొబ్బ నర్సింహారావు, అంబిక సత్యనారాయణ, శంకర్, లవంగరాజు, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

సుభాష్‌నగర్:జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రచర్యలను ప్రతి ఒక్కరు ఖండించాలని ఉగ్రచర్యకు కారణమైన ఏ ఒక్కరిని వదిలిపెట్టేది లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయం నుంచి నిఖిల్‌సాయి చౌరస్తా వరకు భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులను టార్గెట్ చేసుకొని ఉగ్రవాదులు దాడులకు పాల్పడ్డారని అన్నారు. భారతదేశంలో అశాంతిని నెలకొల్పాలనే ఉద్దేశంతో ఉగ్రవాదులు దాడులు చేశారని అన్నారు. ప్రపంచంలో ఇస్లామిక్ ఉగ్రవాదులు పెరిగిపోయారని వీరి పట్ల ప్రపంచ దేశాలు కఠినంగా వ్యవహరించి ఉగ్రవాదులను ఏరిపారేయాలని అన్నారు. భార్య భర్తలను, చిన్న పిల్లలని చూడకుండా ఉగ్రవాదులు దారుణంగా కాల్చిచంపారని అన్నారు. వీరిపై మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. ఉగ్రవాద చర్యలను ప్రతి ఒక్కరు ఖండించాలని అన్నారు. ఉగ్రవాద చర్యలను తలుచుకొని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కన్నీటి పర్యంతమయ్యారు. కార్యక్రమంలో జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లెగంగారెడ్డి, బీజేపీ మాజీ ఫ్లోర్ లీడర్ స్రవంతిరెడ్డి, పోతన్‌కర్ లక్ష్మణ్‌రావు, సంజీవ్‌పురోహిత్, పిల్లిశ్రీకాంత్, గంగాధర్, బాలరాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సుభాష్‌నగర్ :ఉగ్రదాడిలో మరణించిన సామాన్య ప్రజలకు ఆత్మశాంతి చేకూరాలని టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవోస్ కార్యాలయం నుంచి కోర్టు చౌరస్తా, ధర్నా చౌరస్తా వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఉద్యోగ జేఏసీ చైర్మన్ నాశెట్టి సుమన్ మాట్లాడుతూ ఉగ్రదాడిని దేశం మొత్తం ముక్తకంఠంతో ఖండించాలన్నారు. ఇలాంటి దాడులకు పాల్పడిన వారిపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నేతికుంట శేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గౌని గంగారాం, శ్రీనివాస్, పెద్దోల్ల నాగరాజ్, దినేష్‌బాబు, జాకీర్ హుస్సేన్, మారుతి, సృజన్, రాజశేఖర్, సతీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రైతు మహోత్సవాన్ని సందర్శించిన అఖిల భారత ఐక్య రైతు సంఘం నాయకులు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి):జిల్లా కేంద్రంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న రైతు మహోత్సవ కార్యక్రమాన్ని బుధవారం అఖిల భారత ఐక్య రైతు సంఘం నిజామాబాద్ రూరల్, కామారెడ్డి సంయుక్త జిల్లా కమిటీ బృందం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి దేవరాం, నాయకులు సురేష్, రాజన్న, తదితరులు సందర్శించారు. ఈ కార్యక్రమం వల్ల రైతులకు అవగాహన కలుగుతుందని అన్నారు. ప్రతీ మండలంలో రెండు రోజుల పాటు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి రైతులకు ఆర్గానిక్ వ్యవసాయం పట్ల అవగాహన కల్పించాలని స్వామినాదన్ కమిటీ కమీషన్ సిఫార్సులను అమలు చేయాలని కోరారు.

చట్టాన్ని అతిక్రమిస్తే స్కానింగ్ సెంటర్లపై చర్యలు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి):పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని అతిక్రమించి గర్భిణులకు స్కానింగ్ నిర్వహించి పుట్టబోయే బిడ్డ ఆడ, మగ అని తెలిపే స్కానింగ్ సెంటర్లపై చర్యలు తీసుకుంటామని జిల్లా ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రాజశ్రీ తెలిపారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రత్యేక బృందాల ద్వారా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని అతిక్రమించిన వారిపై, రిజిస్ట్రేషన్ లేని సెంటర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో పీవో ఎంసీహెచ్ డాక్టర్ సుప్రియ, గైనకాలజిస్టు డాక్టర్ బిందు, రేడియాలజి డాక్టర్ శ్రావణి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, సీడీపీవో, డీఈఎంవో నాగలక్ష్మి, డీహెచ్ఈ వేణుగోపాల్, డీఈవో దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ యజమానులకు జరిమానా

ఎడపల్లి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బోధన్-నిజామాబాద్ ప్రధాన రహదారిపై అధిక లోడుతో, అతి వేగంగా నడుపుతూ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ఇసుక టిప్పర్‌తో పాటు మరో ఆరుఇసుక టిప్పర్‌లకు ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి బుధవారం జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక లోడుతో, అతి వేగంగా వెలుతూ ప్రజలకు ఇబ్బందులకు గురిచేయవద్దని, పరిమిత వేగంతో వాహనాలను నడపాలని లేని యెడల కఠిన చర్యలు ఉంటా యని ఎస్సై హెచ్చరించారు.



రాష్ట్రస్థాయి మార్కులు సాధించిన విద్యార్థులతో ఎస్ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ మారయ్యగౌడ్

ఇంటర్ ఫలితాలలో ఎస్ఎస్ఆర్ విద్యార్థుల అత్యుత్తమ ప్రతిభ

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్ ఫలితాలలో నగరంలోని ఎస్ఎస్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో నాబిశెట్టి విష్ణు 959/1000, శ్రీరాం వెంకటేశ్ 949/1000, జ్యోపిషా మెహక్ ఎంపీహెచ్‌డబ్ల్యూలో 839/1000, జి.అనిత 822/1000, రమ్య 810/1000 మార్కులు సాధించడంతో పాటు ఇంటర్ ప్రథమ సంవత్సరం వొకేషనల్ విభాగంలో అర్బియానాజ్ ఎంఎల్‌టీలో 483/500, అబ్దుల్ నబీర్ 469/500 మార్కులను సాధించారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఎఫ్)లో సంగెం సుమ 450/500, హర్షియా జూటి ఎంఎల్‌టీలో 443/500, ఫిర్దోసి 439/500, రాణి 432/500, మానస 432/500 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించినట్లు విద్యాసంస్థల చైర్మన్ మారయ్యగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. క్రమశిక్షణతో ప్రణాళిక బద్ధంగా చదువు కొనసాగించాలని అందుకు తమ విద్యాసంస్థ ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహిస్తుందన్నారు. నాన్ రెసిడెన్షియల్ కళాశాలలో రాష్ట్ర, జిల్లా స్థాయి మార్కులను సాధించడం గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ హర్షిత్‌గౌడ్, ప్రిన్సిపాల్ రవీందర్‌గౌడ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపనయన సంస్కారాలు



ఉపనయన సంస్కార వటువులు

నిజామాబాద్ కల్చరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వేద పరిరక్షణ చిన్నారులలో ఆధ్యాత్మికత పెంపొందించడానికి బ్రాహ్మణులు చేసుకునే ఉపనయన సంస్కారాలు ఇందూరు బ్రాహ్మణ బంధువుల ఆధ్వర్యంలో ఘనంగా సాగాయి. బుధవారం సుభాష్‌నగర్‌లోని రామాలయంలో నిర్వహించిన ఉచిత ఉపనయన సంస్కారాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదపండితుల వేదమంత్రోచ్ఛరణలతో వటువులకు గాయత్రీ మంత్రాన్ని ఉపదేశిస్తూ యజ్ఞోపవితధారణ కార్యక్రమాన్ని జరిపారు. ఈ సందర్భంగా వేదపండితులు ఆంజనేయశర్మ మాట్లాడుతూ.. ఉచిత ఉపనయన సంస్కారాలు నిర్వహించడం గొప్ప విషయమని అన్నారు. తల్లిని మించిన దైవం లేదు. గాయత్రీ మంత్రం మించిన మంత్రం లేదని అన్నారు. గాయత్రీ మంత్రంతో వేద అధ్యయనం చేయవచ్చని హైందవ సంస్కృతికి మూలదారణం అని అన్నారు. జిల్లా నలుమూలల నుంచి బ్రాహ్మణులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ఆనందంగా ఉందని నిర్వాహకులు మంతని జయంతి కుమార్, రొట్టె సురేష్‌కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్, తదితర బ్రాహ్మణులు పాల్గొన్నారు.

ప్రారంభమైన వేసవి శిక్షణ శిబిరం

నిజామాబాద్ కల్చరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో మానసిక వికాసాన్ని పెంపొందించడానికి ప్రతియేటా నిర్వహించే వేసవి శిక్షణ శిబిరం బుధవారం ప్రారంభమైంది. శివాజీనగర్‌లోని రామకృష్ణ విద్యానికేతన్‌లో రామకృష్ణ పరమహంస శిష్యులు ఎస్ఎన్ చారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి శిక్షణ శిబిరం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఆయా రంగాల్లో నిపుణులతో శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. విద్యార్థులకు యోగా, మెడిటేషన్, మోరల్ స్టోరీస్, భగవద్గీత శ్లోకాలు, చిత్రలేఖనం, వ్యక్తిత్వ వికాస తరగతులు నేర్పించడం జరుగుతుందన్నారు. 20 రోజుల పాటు విద్యార్థులకు శిక్షణ అందించడం జరుగుతుందని అన్నారు. వేసవి శిక్షణ తరగతులు విద్యార్థులకు అవగాహన పెంపొందించడంతో పాటు నైపుణ్యం పెంపొందించడానికి ఉపయోగపడుతాయని అన్నారు. స్వామి వివేకానంద జీవితానికి సంబంధించిన అనేక ఘట్టాలను విద్యార్థులకు కథల రూపంలో చెప్పడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసచార్య, మధుసూదనచారి, శశిరేఖ, మాధురి, లక్ష్మిప్రియ, సునీత, సంధ్యారాణి పాల్గొన్నారు.

నేడు ప్రజావేదిక

నిజామాబాద్ రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాంనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2024-25 సంవత్సరానికి సంబంధించిన పనులపై సామాజిక తనిఖీ బృందం గత వారం రోజులుగా సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నారు. ఉదయం 11.30లకు పనులకు సంబంధించి పూర్తి వివరాలను ఈ సమావేశంలో చదివి వివరించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్రసహాయకులు, సంబంధిత అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.150	రూ.270	రూ. 300
వెన్‌కాబ్(కిలో)	రూ.160	రూ.280	రూ. 310

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.97,600	రూ.93,000	రూ.1000

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి (10.00, 1.00, 4.00, 7.00, 10.00)
స్క్రీన్-2 : ఓదెల-2 (10.00, 1.05, 4.10, 7.15, 10.20)
స్క్రీన్-3 : పడ్డింగ్టన్ ఇన్ పేరు (హిందీ) (11.05)
: జాట్ (హిందీ) (1.30)
: సిన్నర్స్ (ఇంగ్లీష్) (4.40, 7.40, 10.40)
స్క్రీన్-4 : డియర్ ఉమా (11.00)
: ది చూసెన్ లాస్ట్ సుప్పర్ (ఇంగ్లీష్) (2.10, 7.40)
: జాక్ (4.45)
: పడ్డింగ్టన్ ఇన్ పేరు (హిందీ) (10.20)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఓదెల-2 (10.40, 1.30, 4.30, 7.20, 10.20)
స్క్రీన్-2 : అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి (11.00, 1.35, 4.30, 7.25, 10.20)
స్క్రీన్-3 : గుడ్ బ్యాడ్ అగ్లీ (11.00, 10.40)
: ఒక్కడు (1.40, 7.40)

లలితామహల్ : జాక్ (11.15, 2.15, 6.15, 9.15)
దేవి : అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : జాట్ (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : ఓదెల-2 (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్